మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఆహ్వానం

కడ్తాల్, మార్చి 19: మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. మండల పరిధిలోని చరికొండ గ్రామ పంచాయతీ పరిధిలోని బోయిన్‌గుట్ట తండాలో ఏర్పాటు చేసిన సంత్ సేవాలాల్ మహారాజ్, మహాత్మాగాంధీ, అంబేద్కర్ విగ్రహాల ఆవిష్కరణకు ఏప్రిల్ 2న రావాలని హరీశ్‌రావును ఆహ్వానించినట్లు నాయకులు తెలిపారు. అదే విధంగా ముద్విన్ గ్రామంలో పేద కుటుంబానికి రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన ఇంటిని ప్రారంభించాలని ట్రస్ట్ చైర్మన్, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్ ఆయనను కోరినట్లు తెలిపారు. మాజీ మంత్రిని కలిసిన వారిలో చరికొండ మాజీ సర్పంచ్ నర్సింహాగౌడ్, మాజీ ఉప సర్పంచ్ నరేశ్, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు జంగయ్యగౌడ్, నాయకులు నరేశ్‌గౌడ్, సాబేర్, అంజినాయక్, గోపాల్, వెంకటయ్య ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కడ్తాల్, మార్చి 19: మండల పరిధిలోని రావిచేడ్ గ్రామ సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ నరేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థాయి పెంచేందుకు పనులు చేపడుతున్నామని, ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ సరఫరాకు అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

కార్గోలో కల్యాణ తలంబ్రాలు

షాద్‌నగర్‌టౌన్, మార్చి 19: శ్రీరామనవమి పురస్కరించుకుని భద్రాచలం సీతారామచంద్రుడి కల్యాణ తలంబ్రాలను భక్తుల వద్దకు చేర్చే విధంగా తెలంగాణ ఆర్టీసీ చర్యలు తీసుకుందని షాద్‌నగర్ ఆర్టీసీ డీఎం ఉష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ సీతారామచంద్రుడి కల్యాణ తలంబ్రాలు కావాల్సిన భక్తులు షాద్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని కార్గో కేంద్రంలో రూ. 151లను చెల్లించి తమ వివరాలను నమోదు చేయించుకోవాలన్నారు. కల్యాణ తలంబ్రాలను హోమ్ డెలవరీ చేయనున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని భక్తులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బడ్జెట్ ఆయా రంగాల ప్రగతికి విరుద్ధం

కేశంపేట, మార్చి 19: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలకు బడ్జెట్‌లో స్థానం లేకపోవడం ఆ పార్టీ అసమర్థ పాలనకు నిదర్శనమని బీఆర్ఎస్ యువ నాయకుడు సాజిద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ రెండవసారి రూ.3,04,965లక్షల కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని, కానీ ఆరు గ్యారంటీల అమలుకు మాత్రం బడ్జెట్‌లో నిధుల కేటాయింపులో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విస్మరించిందన్నారు. అంబేద్కర్ అభయహస్తం పేరున రూ.12లక్షలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ నేతలు, కానీ బడ్జెట్‌లో దానిని ప్రస్తావించకుండా రాజీవ్ యువ వికాసం పేరుతో మరో డ్రామాకు తెరలేపారన్నారు. మహాలక్ష్మీ పథకం కింద మహిళలందరికీ ప్రతి నెల రూ.2500 ఇస్తామన్నారని, వివాహం చేసుకున్న యువతులకు కల్యాణలక్ష్మీతోపాటు తులం బంగారం ఇస్తామని చెప్పారని, బడ్జెట్‌లో వాటికి స్థానం లేదని ప్రశ్నించారు. బడ్జెట్ పూర్తిగా ఆయా రంగాల ప్రగతికి విరుద్ధంగా ఉందని ఆరోపించారు.

అక్రమ నిర్మాణాలను కూల్చండి

పెద్దఅంబర్‌పేట, మార్చి 19: మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారం రెవెన్యూ మత్తుగూడలోని 122, 126 సర్వేనంబర్లలో అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు సీపీఎం అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యదర్శి ఏర్పుల నరసింహ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీలో అనుమతి లేకుండా స్వేచ్ఛగా అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయని తెలిపారు. ఆయన వెంట తట్టిఅన్నారం మాజీ ఎంపీటీసీ ప్రభాకర్, రవికుమార్, యాకుబ్ ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి పరామర్శ

మంచాల, మార్చి 19: మంచాల మండల పరిధిలోని లోయపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు పాలకూర వెంకటేష్‌గౌడ్ తండ్రి జంగయ్యగౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వెంకటేశ్‌గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా జంగయ్యగౌడ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రమేశ్, నాయకులు అరవింద్, యాదయ్య, రాజు ఉన్నారు.

ముగిసిన ఇంటర్ జనరల్ పరీక్షలు

కేశంపేట, మార్చి 19: ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇంటర్ మొదటి సంవత్సర జనరల్ విద్యార్థుల పరీక్షలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా కేశంపేట మండల పరిధిలోని కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పాటిగడ్డ కేజీబీవీతోపాటు జేపీ దర్గా ట్రబల్ వెల్ఫేర్, కొత్తపేట జూనియర్ కళాశాలలకు చెందిన మొదటి సంవత్సర విద్యార్థులు కామర్స్-1, కెమిస్ట్రీ-1 పరీక్షలను రాశారని, 179మందికిగాను ముగ్గురు గైర్హాజరైనట్లు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ మల్లేశ్ తెలిపారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ జనరల్ విద్యార్థుల పరీక్షలు ముగిశాయని, ఒకేషనల్ విద్యార్థులకు గురువారం బ్రిడ్జికోర్సు ఉంటుందని తెలిపారు.

ఆకతాయిలకు అడ్డాగా..

రైతు వేదిక భవనం

- భవనం కిటికీ అద్దాలు పగులగొట్టి లోపలికి చొరబాటు
- రైతు కార్యాలయంలో యథేచ్ఛగా మద్యం తాగుతున్న వైనం
- అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలని రైతుల వేడుకోలు

గదిలో పడేసిన మద్యం, వాటర్ బాటిళ్లు, కాల్చిన సిగరెట్ ముక్కలు

బాత్రూంలో పడేసిన కిటికీ

ఆమనగల్లు, మార్చి 19: రాష్ట్రంలో రైతులకు వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకు నిర్మించిన రైతు వేదిక భవనం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఈ ఘటన ఆమనగల్లు పట్టణంలోని రైతు వేదిక భవనంలో కొన్ని రోజులుగా ఈ తతంగం జరుగుతున్నా సంబంధిత అధికారులు ఏ మాత్రం తమకు పట్టనట్టు వ్యవహరించడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిత్యం రైతు వేదిక భవనంలో రైతులకు అందుబాటులో ఉండాల్సిన అధికారులకు ఇవి ఏమి కనిపించడం లేదా అంటూ స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం మండలానికి ఒకటి చొప్పున రైతు వేదిక భవనాల్లో భాగంగా ఆమనగల్లులోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారి పక్కన రూ.22 లక్షలతో నిర్మించింది. ఇందులో నిత్యం సంబంధిత అధికారులు రైతులకు వ్యవసాయ రంగంలో సలహాలు, సూచనలు ఇవ్వాల్సి ఉంటుంది. ప్రతి మంగళవారం రైతు నేస్తం కార్యక్రమాన్ని వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ప్రొజెక్టర్‌పై ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు రైతులకు ఆధునిక, సేంద్రియ వ్యవసాయం వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు అవగాహన కల్పించాల్సి ఉంటుంది. కానీ ఆమనగల్లు రైతు వేదిక భవనం ఆకతాయిలకు అడ్డాగా మారింది. భవనం వెనుకభాగంలో కిటికీల అద్దాలు పగులకొట్టారు. మరో కిటికీని తొలిగించి అందులోకి ప్రవేశించి మద్యం తాగుతున్నారు. లోపల ఖాళీ సీసాలు, వాటర్ బాటిళ్లు, కాల్చిన సిగరెట్ ముక్కలు పడి ఉన్నాయి. లోపలి పరిస్థితిని చూస్తే కొన్ని రోజులుగా రైతు వేదిక భనం తెరుచుకోవడం లేదనే అనుమానం వ్యక్తమవుతుంది. భవనం ఎదుట, పక్కన ఖాళీ మద్యం సీసాలు, వాటర్ బాటిళ్లు, తీసివేసిన విస్తరాకులు, కాల్చిన సిగరెట్ ముక్కలు దర్శనమిస్తున్నాయి. సంబంధిత అధికారులు ఈ ఘటనపై దృష్టి సారించి అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలని రైతులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఆమనగల్లు రైతు వేదిక భవనం

పార్టీ జెండా దిమ్మె ధ్వంసంపై నిరసన

ఆగ్రహం వ్యక్తం చేసిన బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నటరాజ్, మున్సిపల్ మాజీ చైర్మన్ నరేందర్

షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

ధ్వంసమైన దిమ్మెవద్ద ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

షాద్‌నగర్, మార్చి 19: ఇతర పార్టీల జెండా దిమ్మెలను ధ్వంసం చేయడం దురదృష్టకరమని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నటరాజ్, మున్సిపల్ మాజీ చైర్మన్ నరేందర్ ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో దిమ్మెను ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షాద్‌నగర్ పట్టణంలోని ఫరూఖ్‌నగర్ సుభాశ్ చంద్రబోస్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ జెండా దిమ్మెను ధ్వంసం చేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని పార్టీల నేతలు ప్రగతికోసం పాటుపడాల్సిన అవసర ముందన్నారు. జెండా దిమ్మె ధ్వంసమైన ప్రాంతానికి సమీపంలోని దర్గా ఆవరణలో సీసీ కెమెరాలు ఉన్నాయని, ఈ విషయమై పోలీసులు సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు తీవ్రం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ కవిత నారాయణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, మాజీ కౌన్సిలర్లు నర్సింహ, అనంతయ్య, యుగంధర్, శేఖర్, చింటు, శంకర్, నందకిశోర్, చిన్నయాదగిరి, నాయకులు జంగయ్య, శ్రీనివాస్, అశోక్, మల్లేశ్, శివ, శ్రీశైలం, వెంకటేశ్‌గుప్త, సుశాంత్, రాజు, మహమూద్, నరేందర్, ఉమాపతి, తేజయాదవ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

షాబాద్, మార్చి 19: ఉపాధిహామీ కూలీలకు పెండింగ్‌లో ఉన్న కూలి బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.జంగయ్య డిమాండ్ చేశారు. బుధవారం షాబాద్ మండల పరిధిలోని మన్‌మర్రి గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను సీపీఐ మండల కార్యదర్శి ఎన్.జంగయ్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నరేంద్రమోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధిహామీ పథకానికి నిధుల కోత విధించడం, పథకాన్ని నిర్లక్ష్యం చేయడం, ఉద్యోగులను తొలగించడం జరుగుతుందని మండిపడ్డారు. పెండింగ్‌లో ఉన్న డబ్బులను వెంటనే కూలీల బ్యాంకు ఖాతాల్లో వేయాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహులు, భిక్షపతి, వెంకటేశ్, లక్ష్మమ్మ, మణెమ్మ, కూలీలు పాల్గొన్నారు.

కూలీలతో మాట్లాడుతున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగయ్య

మల్లు స్వరాజ్యం పోరాటం స్ఫూర్తిదాయకం

యాచారం, మార్చి19: మండలంలోని కుర్మిద్ద గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు మల్లు స్వరాజ్యం 3వ వర్ధంతిని సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు సురేశ్ మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో దున్నేవాడికే భూమిదక్కాలని రజాకార్లకు ఎదురొడ్డిన వీరవనిత మల్లు స్వరాజ్యం అన్నారు. వెట్టి చాకిరి విముక్తి కోసం ఆమె చేసిన పోరాట స్ఫూర్తి నేటి మహిళలకు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో నాయకులు గోవర్ధన్, జోసెప్, మల్లేశ్, పవన్, జాన్, కిరణ్, శివ పాల్గొన్నారు.

మల్లుస్వరాజ్యం ఆశయసాధనకు కృషిచేస్తాం

ఇబ్రహీంపట్నం : మల్లు స్వరాజ్యం వర్ధంతిని బుధవారం ఇబ్రహీంపట్నం పాషా, నరహరి స్మారక కేంద్రంలో నిర్వహించి ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సామెల్ మాట్లాడుతూ..మల్లుస్వరాజ్యం పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని, ఆమె ఆశయసాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బుగ్గరాములు, జంగయ్య, జగన్, ఎల్లేశ్, వెంకటేశ్, ముసిలయ్య, పురుషోత్తం, ఆనంద్, జంగయ్య, యాదగిరి, దశరథ, రవి, శ్రీకాంత్, మహంకాళి, స్వామి, భిక్షపతి తదితరులున్నారు.

ఇబ్రహీంపట్నం : మల్లు స్వరాజ్యం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కొండారెడ్డిపల్లిలో రోడ్డు పనులు ప్రారంభం

కేశంపేట, మార్చి 19: మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వెనక భాగం నుంచి ఎస్సీకాలనీలో సీసీరోడ్డును నిర్మిస్తున్నట్లు కరుణాకర్ తెలిపారు. త్వరలోనే పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో తిప్పిశెట్టి సుదర్శన్, ఎ.లింగం, వి.లింగం, శ్రీను, యాదయ్య, నర్సింహులు, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చాలి

జెండా ఆవిష్కరిస్తున్న సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి

చేవెళ్ల రూరల్, మార్చి 19 : కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి డిమాండ్ చేశారు. బుధవారం భారత కమ్యూనిస్టు పార్టీ 100 వసంతాల వారోత్సవాల్లో భాగంగా మండల పరిధి రామన్నగూడ గ్రామంలో సీపీఐ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ మక్బూల్ ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి రామస్వామి ముఖ్యఅతిథిగా హాజరై సీపీఐ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఎం.సత్తిరెడ్డి, ఏఐకేఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సుధాకర్‌గౌడ్, గీత పనివారల సంఘం మండల కార్యదర్శి కృష్ణగౌడ్, ఏఐటీయూసీ మండలాధ్యక్షుడు శివ, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మంజుల, ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సభ్యులు మీనాక్షి, వెంకటమ్మ, సుగుణమ్మ పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

యాచారం, మార్చి19: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జైభీం డ్యూకేటెడ్ యూత్ అధ్యక్షుడు వివేక్ అన్నారు. మండలంలోని నందివనపర్తి గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లతో పాటు పెన్నులు, పెన్సిళ్లను ఆయన బుధవారం ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు ప్రశాంత్, శివాజీ, శ్రీనాథ్, గౌతమ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

మద్యం సేవించినవారికి జరిమానా

మార్కెట్ యార్డులో ఘటన

చేవెళ్ల రూరల్, మార్చి 19 : గ్రామ పంచాయతీ పరిధిలోని మార్కెట్ యార్డులో గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మద్యం సేవించడంతో పంచాయతీ కార్యదర్శి వారికి రూ.1000 జరిమానా విధించాడు. వివరాల్లోకి వెళితే.. శంకర్‌పల్లి మండల పరిధి కొండకల్ పంచాయతీ మార్కెట్ యార్డులో బుధవారం గ్రామానికి చెందిన ఇద్దరు మద్యం సేవిస్తూ కనిపించారు. విషయం తెలుసుకున్న పంచాయతీ అధికారి, సిబ్బంది అక్కడకు చేరుకొని వారికి జరిమానా విధించారు. పంచాయతీకి సంబంధించిన కార్యాలయాలు, పరిసరాల్లో మద్యం సేవించినా, చెత్త వేసినా జరిమానా విధిస్తామని పంచాయతీ సెక్రటరీ రియాజుద్దీన్ హెచ్చరించారు.

చలివేంద్రం ప్రారంభం

యాచారం, మార్చి19: మండలంలోని కుర్మిద్దలో మాజీ ఉపసర్పంచ్ జోసెఫ్ సహకారంతో బుధవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలి వేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. మండు వేసవిలో ప్రజలు, ఉపాధి కూలీలు, ప్రయాణికులు, బాటసారులు చలివేంద్రాల ద్వారా తమ దప్పికను తీర్చుకుంటారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేశ్, గ్రామస్తులు, యువకులు ఉన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

రేపటి నుంచి పది పరీక్షలు
నియోజకవర్గంలో 21పరీక్షా కేంద్రాలు
హాజరు కానున్న
4262మంది విద్యార్థులు

షాద్‌నగర్‌టౌన్, మార్చి 19: తెలంగాణ విద్యాశాఖ నిర్వహించే పదో తరగతి వార్షిక పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఇందుకు సంబంధించిన పరీక్షా కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లను విద్యాశాఖ అధికారులు పూర్తి చేశారు. ఉదయం 9:30 నిమిషాలకు ప్రారంభమై మాధ్యాహ్నం 12:30గంటలకు ముగుస్తాయి.

నియోజకవర్గంలో 21పరీక్షా కేంద్రాలు

షాద్‌నగర్ నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పదో తరగతి చదవిన 4262 మంది విద్యార్థులతో పాటు పట్టణంలోని మరియారాణి ప్రైవేట్ పరీక్షా కేంద్రంలో సాధారణ విద్యార్థులతో పాటు 105మంది ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. నియోజకవర్గంలో మొత్తం 21పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. షాద్‌నగర్ పట్టణంలో 10పరీక్ష కేంద్రాలు, ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద ఒకటి, నందిగామ మండల కేంద్రంలో ఒకటి, కొత్తూరు మండల కేంద్రంలో మూడు, కొందుర్గు మండల కేంద్రంలో రెండు, చౌదరిగూడ మండల కేంద్రంలో ఒకటి, కేశంపేట మండల కేంద్రంలో మూడు పరీక్షా కేంద్రాలలో పరీక్షలు జరగనున్నాయి.

గంట ముందే చేరుకోవాలి

విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేశాం. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి గంట ముందుగానే చేరుకోవాలి. ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే సంబంధిత అధికారులకు తెలుపాలి. అంతేకాకుండా ప్రతి పరీక్ష కేంద్రంలో ఫర్నిచర్, సీలింగ్ ఫ్యాన్స్‌ను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఉంటుంది.

-మనోహర్, ఫరూఖ్‌నగర్
మండల విద్యాధికారి, షాద్‌నగర్

మున్సిపాలిటీలో అప్పోజిగూడ విలీనం

మొయినాబాద్, మార్చి 19 : ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొయినాబాద్ మున్సిపాలిటీలో మరో గ్రామ పంచాయతీని విలీనం చేస్తూ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించింది. మొయినాబాద్ మండలంలోని 8 గ్రామ పంచాయతీలు అయిన అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, ఎన్కేపల్లి, చిలుకూరు, మొయినాబాద్, సురంగల్, ముర్తుజాగూడ, పెద్ద మంగళారం గ్రామ పంచాయతీలను విలీనం చేస్తూ రెండు నెలల క్రితం మున్సిపాలిటీని ఏర్పాటు చేసింది. మున్సిపల్ అధికారులు మొయినాబాద్ మున్సిపాలిటీని అధికారికంగా జనవరి 27వ తేదీన తన ఆధీనంలోకి తీసుకున్నారు. తమ గ్రామాన్ని విలీనం చేయాలని కోరుతూ పంచాయతీ ప్రజలు ప్రభుత్వానికి ప్రతిపాదన పెట్టుకున్నారు. దీనిని పరిశీలించిన ప్రభుత్వం అప్పోజిగూడను మున్సిపాలిటీలో విలీనం చేస్తున్నట్లుగా బుధవారం అసెంబ్లీలో ప్రకటించింది. 9 గ్రామాలు మున్సిపాలిటీలో విలీనం కావడంతో మొయినాబాద్ మండలంలో 19 పంచాయతీలు మిగిలాయి.

మిషన్ భగీరథ పైపులైన్ గుంత పూడ్చివేత

మాడ్గుల, మార్చి 19 : మండల పరిధిలోని పాతబ్రాహ్మణపల్లి గ్రామ సమీపంలో మిషన్ భగీరథ పైపు పగిలి లీకేజీ ఏర్పడింది. గుంతను తీయించి మరమ్మతులు చేయించారు. తీసిన మట్టిని అలాగే రోడ్డుపై వదిలేశారు అని నమస్తే తెలంగాణ దినపత్రికలో వచ్చిన కథనానికి మిషన్ భగీరథ అధికారులు, కాంట్రాక్టర్ స్పందించి వెంటనే గుంతను పూడ్చివేసి రోడ్డుపై ఉన్న మట్టిని తొలగించారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం సంతోషకరం



చేవెళ్ల టౌన్: మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

చేవెళ్లటౌన్, మార్చి 19: అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదించడం సంతోషకరమని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి శివశంకర్, ఎమ్ఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు భానుప్రసాద్ మాదిగ అన్నారు. బుధవారం చేవెళ్ల మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో అమరవీరులకు నివాళులర్పించి, మందకృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ఆమోదం బిల్లుతో మాదిగలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

కొందుర్గులో సంబురాలు

కొందుర్గు : వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదించడంపట్ల కొందుర్గు మండలంలో ఎమ్మార్పీఎస్ నేతలు బుధవారం సంబురాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ కొందుర్గు మండల అధ్యక్షుడు ఆనంద్‌మాదిగ మాట్లాడుతూ.. మందకృష్ణ మాదిగ రాజీలేని పోరాట ఫలితంగానే వర్గీకరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపిందన్నారు. కార్యక్రమంలో ప్రేమ్‌కుమార్, సిద్దు, నర్సింహులు, చెన్నయ్య, యాదయ్య, రమేశ్, అశోక్, నరేశ్, రామస్వామి, రవితేజ, చంద్రయ్య, గణేష్, సాయి, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

పోరాట ఫలితమే వర్గీకరణ బిల్లు ఆమోదం

కేశంపేట : మంద కృష్ణమాదిగ పోరాట ఫలితమే నేడు ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ బిల్లు ఆమోదమని ఎమ్మార్పీఎస్ కేశంపేట మండల అధ్యక్షుడు శ్రీనుమాదిగ అన్నారు. వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కేశంపేట మండల కేంద్రంలో మంద కృష్ణమాదిగ చిత్రపటానికి బుధవారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి రమేశ్, నాయకులు దశరథ, సునీల్, మహేశ్, మల్లేశ్, హరికుమార్, రాజు, మల్లయ్య, జంగయ్య, మహేశ్, సురేశ్, మురళీ, మనీశ్, ప్రదీప్, లడ్డు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

హర్షవర్ధన్‌రెడ్డి (ఫైల్)

చేవెళ్ల రూరల్, మార్చి 19 : గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. సీఐ శ్రీనివాస్‌గౌడ్ వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మండల పరిధి పిల్లగుండ్ల గ్రామానికి చెందిన హర్షవర్ధన్‌రెడ్డి (30) స్థానికంగా ఉన్న ఓ కన్‌స్ట్రక్షన్‌లో సైట్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం అర్ధరాత్రి డ్యూటీని ముగించుకొని తిరిగి ఇంటికి తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్న క్రమంలో బుల్కాపూర్ రైల్వే అండర్ పాస్ దాటగానే గుర్తు తెలియని వాహనం వెనకనుంచి ఢీ కొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో హుటాహుటిన దవాఖానకు తరలిస్తుండగా మార్గంమధ్యంలో మృతి చెందాడు. మృతుడి సోదరుడు ధృవతే